# ఆంధ్రభూమి

# యువతలో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత

## విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



జేఎన్‌టీయూకే హాస్టల్ భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ, ఆగస్టు 14: వృత్తి విద్యా నైపుణ్య కేంద్రాలను, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను స్థాపించి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు శిక్షణనివ్వడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం స్థానిక జేఎన్‌టీయూకేను ఆయన సందర్శించి, హాస్టల్ భవనాలైన నివేదిత, నాగావళి, నటరాజ వసతి గృహాల్లోని మొదటి, రెండవ అంతస్తులను, రీసెర్చ్ ఇన్నోవేషన్ సెంటర్‌లోని ల్యాబ్‌లను, ఎగ్జామినేషన్ సెక్షన్‌లోని పరీక్షా విభాగాన్ని ప్రారంభించారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, సీమెన్స్ సెంటర్ వర్క్‌షాపును సందర్శించి వాటి పనితీరు గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. మంత్రి సురేష్‌తోపాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, తుని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీలు రాము సూర్యారావు, ఐ వెంకటేశ్వరరావు, కాకినాట సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డి మురళీధర్‌రెడ్డి, జేఎన్‌టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ ఎం రామలింగరాజు పాల్గొన్నారు. ముందుగా దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను (మిగతా 6వ పేజీలో)

## యువతలో...

ఒకటో పేజీ తరువాయి

పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అభివృద్ధిచేసి సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జేఎన్‌టీయూకే మిగిలిన కళాశాలకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. యూనివర్శిటీలో ఉన్న ఆర్‌అండ్‌డీ విభాగం విద్యార్థులకు శిక్షణనిచ్చి నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని, ఇన్నోవేటివ్ సెంటర్ల ద్వారా పరిశోధనను ప్రోత్సహించాలని, పరిశ్రమలతో అనుసంధానమై సమస్యలకు పరిష్కారాలను కనుగొని ఆదాయ మార్గాలను మెరుగుపర్చాలన్నారు. ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీలే కాకుండా ప్రభుత్వ యూనివర్సిటీలు కూడా అంతర్జాతీయస్థాయికి దీటుగా వెళ్లాలని, యూనివర్సిటీలు న్యాక్, ఎన్‌బీఏ గుర్తింపు తప్పకుండా పొందాలన్నారు. జేఎన్‌టీయూకే, ఆంధ్రా యూనివర్సిటీ, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలు అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లో ముందుండాలన్నారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలను అవసరం మేరకు భర్తీ చేస్తామని, 1:2:4 నిష్పత్తిని పాటిస్తామని, విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తిని కూడా పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికై కమిటీ వేశామని, నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఉన్నత విద్య మెరుగుపరిచేందుకు రాష్ట్రం రెగ్యులేటరీ మోనిటరింగ్ కమిషన్ పేరుతో ఒక చట్టం రూపొందించిందని, ఈ కమిషన్ కళాశాలలను పర్యవేక్షిస్తూ రుసుములను నియంత్రిస్తుందని, ఇది ఒక రిటైర్డు జడ్జి ఆధ్వర్యంలో నడుస్తుందన్నారు. ప్రైవేటు, డీమ్డ్ పరిశ్రమల నుంచి సలహాలు తీకుని ఈ కమిషన్‌ను ముందుకు సాగేలా రూపుదిద్దుతామన్నారు. జేఎన్‌టీయూకే నరసారావుపేటలో త్వరలో నిర్మాణాలు చేపడతామని, జేఎన్‌టీయూకే బీ ప్లస్ గ్రేడ్ నుంచి ఏ ప్లస్ గ్రేడ్ పొందేలా కృషి చేయాలన్నారు. కేంద్ర పరిధిలోని ఎంహెచ్‌ఆర్డీ నుంచి రూసా నిధులు రాబట్టడానికి ప్రయత్నిస్తామన్నారు. అనంతరం అలూమ్ని ఆడిటోరియంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతీ నిమిషాన్ని సద్వినియోగపర్చుకుని తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ తమ వృత్తికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈసందర్భంగా యూసీఈకే, జేఎన్‌టీయూకే టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఐ శాంతిప్రభ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు, ఓఎస్డీ, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి రవీంద్రనాథ్, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ప్రోగ్రాం డైరెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, పోలీసు అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.